# తెలుపూ నలుపూ

౧

"వాల్తేరు పాసింజరు నూటపదినిమిషాలు లేటు" అంటోంది ఎంక్వయిరీ ఆఫీసుదగ్గిర నల్లబల్ల. నిమిషాలలో చెబితే ప్రయాణీకులకి కొంచెం విసుగుతగ్గి చేదుమాత్రని తియ్యగా మింగుతారని అధికారుల ఉద్దేశంకాబోలు! ఎంత తెలివైనవాళ్లు! నిర్మొగమాటంగా ఆధునిక కవిలాగా "నువ్వు ఎక్కదలచిన రైలు ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు!" అని తెగేసి చెప్పి తెరువరుల మనసులు నొప్పించటం వాళ్లకి ఇష్టం లేదులాగుంది... నిమిష నిమిషానికీ ప్రయాణీకుల ప్రవాహం పిల్లకాలవలని చేర్చుకున్న నదిలాగా పొంగిపోయి ప్లాట్‌ఫారమ్‌మీద మోతలు పెడుతోంది.

పెట్టెలూ, తట్టలూ, పరుపుచుట్టలూ, సామాన్లమూటలూ పద్మవ్యూహం పన్నుతున్నయ్. అరిటిపళ్ల తొక్కలూ, ఆరని సిగిరెట్టు ముక్కలూ, కంతలతట్టలలో గీవురుగావురుమంటూ గందరగోళం చేస్తున్న బాతులగుంపులూ, "తప్పుకోండి తప్పుకోండి" అని ట్రాలీసామాను తోసుకుంటూ వచ్చే కూలీలకేకలూ, కాలక్షేపపు బటాణీల పటపటలూ, సినిమాసాంగ్సు బ్రహ్మంగారి కాలజ్ఞానం, కొత్త నవలలు అంటూ అమ్మేవాడి హడావిడీ చూస్తుంటే మధుసూధనరావుకి కాలం స్తంభించి పోయిందా అనిపిస్తోంది. ఇక ఇవాళ రైలు అసలే రాదేమో అని అనుమానం తగులుతోంది. ఇంకో సిగిరెట్టు వెలిగించి మెల్లిగా పచార్లు చెయ్యటానికి లేచాడు. ఇందాకటినించీ దిన పత్రికలో మునిగిపోయాడు. తలయెత్తి చూసేసరికి కొంచెందూరంలో బెడ్డింగ్‌మీద కూర్చున్న

స్త్రీ అతని కళ్ల పడింది. గుర్తుపట్టటానికి క్షణంకూడా పట్టలేదు. సాదా తెల్లచీర....తలమీద ముసుగులో ముఖం దాచుకుంటోంది. పలచటి తెలిమబ్బులోంచి దోబూచులాడే చంద్రకాంతిలాగా మిస మిస లాడుతున్న శరీరకాంతి....తుమ్మెదబారులని గుర్తుచేసే వొంకెల జుట్టూ....విశాలమైన నుదురూ.... చూస్తుంటే అతని గుండె గతుక్కుమంది. చేతులకి గాజుపోచకూడా లేదు. నుదుటి మీద కుంకుమరేఖ కనిపించటంలేదు. మూడేళ్ల పసివాడు కొంగు పట్టుకుని చుట్టూ తప్పటడుగులేస్తూ, ముద్దుమాటలతో నవ్వులు ఒలి కిస్తూ ఆడుకుంటున్నాడు.... పలకరిద్దామా వద్దాఅనే గుంజాటనతో మనస్సు ఆరాటపడుతోంది. గతకాలంమీద వాలిన తెరని తొలగిం చటం దేనికి ? మూసుకుపోయిన స్మృతిలోకపు ద్వారాలని తెరవ టం దేనికి ? అయినా కనిపించినప్పుడు పలకరించకుండా, పరాయి వాళ్లలాగా శత్రువుల్లాగా మూగనోము పట్టటం దేనికి ? చూసి ఎన్నేళ్లయిందో ? పలకరిస్తే తనని గుర్తుపట్టగలదా ? తను ఎక్కువ మారలేదు. కొంచెం లావెక్కి వుండవచ్చు. మునుపటి కంటే తనతల కొంచెం నెరిసివుండవచ్చు. నుదుటిమీద కాలం దున్నిన నాగటిచాలులాగా రెండు గీతలు లోతుగా కనబడవచ్చు. కాస్సేపు తటపటాయించి, అటూ ఇటూ తచ్చాడుతూ తిరిగి ఎదు రుగా వెళ్లి నిలబడి "ఎక్కడికి వెళ్తున్నావ్ రమా ? జ్ఞాపకం వుందా!" అంటూ కుర్రాణ్ని చేతుల్తో ఎత్తుకున్నాడు.

క్షణంసేపు విస్మయంతో మూగవోయింది. ముసుగు నుదుటి మీదికి లాక్కుంటూ లేచి నిలబడి తలవంచుకుని "ఎన్నాళ్లయింది మధూ ! ఢిల్లీనుంచేనా ? అక్కడేగా వుద్యోగం ?" అంది రమ.

"కూచో రమా నేను కొత్తవాడినా ? పరాయివాడినా ? కూచో" అంటూ పెట్టెమీద చతికిలబడ్డాడు మధు.

కుర్రాణ్ని ఒళ్లోకి తీసుకుని బెడ్డింగ్‌మీద కూచుని రమ కుశలప్రశ్నలు వేసింది.

మధు ఇంకా వొంటరిగాడే. పెళ్లిచేసుకోలేదు. ఇక ముందు కూడా చేసుకోదలచలేదుట.

"ఎందుకని ?" అని ఆశ్చర్యంగా అడిగింది రమ.

"అన్నయ్య అకస్మాత్తుగా లారీకిందపడి చనిపోయాడు. ఆరుగురు పిల్లలు. వొదిన రోగిష్ఠిమనిషి. అంతా రెక్కలురాని పసికూనలు. వాళ్ల చదువుసంగీతాలు, పెళ్లిపేరంటాలూ ఎల్లా జరుగుతయ్ ? వాళ్లకి నేనూ, నాకు వాళ్లూ...." అని మధు ముక్తసరిగా తన సంగతి చెప్పాడు.

రమ ఆశ్చర్యంతో విప్పారిన కళ్లతో అతని ముఖంకేసి చూసింది. కనుగొనలలో నీళ్లు చిందినయ్. మధుకి ఆస్తిలేదని చెప్పి తన తండ్రి పరాయిసంబంధం ఇచ్చాడు. చిన్నప్పటినుంచీ ఆటపాటల్లో తనూ మధూ ఎల్లా కలిసిమెలిసి జంటపావురాల్లాగా ఎగిరేవాళ్లో ! తన పెళ్లి అయిన తరవాత ఇన్నేళ్లకి మధుని మొదటిసారి కలుసుకుంది రమ. మధుకి అన్నగారే కష్టపడి చదువు చెప్పించాడు. చిన్న గుమాస్తా ఉద్యోగంతోటే ఎల్లాగో పెనగులాడి తమ్ముడికి పెద్ద చదువు చెప్పించి పైకి తీసుకువచ్చాడు. తీరా తమ్ముడు పైకి వస్తే చూసే అదృష్టం లేకపోయింది కాబోలు. అన్న ఋణం తీర్చుకోటానికి మధు ఈ నిర్ణయం చేసుకున్నాడు కాబోలు.... ఇటువంటివాళ్లే పుస్తకాలపుటలలోనో హాలులో తెర మీదనో కనిపిస్తే అమ్మయ్యో ఎంత త్యాగం ! అని ముక్కున వేలువేసుకుంటాం. కళ్లఎదుట ఆ మనిషి నిలబడ్డప్పుడు మాత్రం మనం గుర్తించలేం అనుకుంది రమ.

"మన వూరే వస్తున్నావా ?" అంది రమ.

"అవును. పాతకొంప వుందికదూ. దాన్ని అమ్మేద్దామని సెలవుపెట్టి వస్తున్నాను. వదినకి మంచి వైద్యం చేయించాలి...." పోగా మిగిలిన పిత్రార్జితం ఆ కొంప వొక్కటే. అదికూడా అమ్మేసి వదినకి వైద్యం చేయిస్తాడుట. మదనపల్లి తీసుకువెళ్తా డుట. రమ కళ్లకి మధు ఏదో ఉన్నత శిఖరంమీద నిలిచిన త్యాగ మూర్తిగా కనిపిస్తున్నాడు.

"నువ్వూ ఇంటికేనన్నమాట!"

"ఇంటికే....ఇంకెక్కడికీ వెళ్లే మార్గంలేదు...." అని కళ్లు తుడుచుకుంది రమ.

"వీడి పుటకలకే వారికి జబ్బుచేసింది. వైద్యానికి దేశ దేశాలూ తిరిగాం. లాభం లేకపోయింది. పోయి ఏడాది దాటింది. ఆస్తి అంతా వైద్యానికే సరిపోయింది...." అని కుర్రాడి తలని గుండెలకి అదుముకుని వెక్కివెక్కి ఏడ్చింది రమ.

ఆమెబావగారిని పీక నులిమెయ్యాలన్నంత కోపం పచ్చింది మధుకి. అంతా తనలాంటివాళ్లే అయితే ఈ లోకంలో ఇంత దుఃఖం ఇంత వేదనా ఎందుకుంటయ్?

ఇంజన్ కూతవేసింది. ఒక బిస్కట్‌పాకెట్ పిల్లాడిచేతు లకి అందించి మధు తన సామానున్న చోటికి వెళ్లాడు.